క్లుప్తంగా

బుర్రాకు కృతజ్ఞతలు



బుర్రాకు కృతజ్ఞతలు తెలుపుతున్న మట్టే వేణుగోపాల్

లింగసముద్రం: వైఎస్సార్ టీయూసీ అధ్యక్షునిగా నియమితులైన మట్టే వేణుగోపాల్ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనను నియమించేందుకు సహకరించిన ఎంపీపీ పెన్నా క్రిష్ణయ్య, జిల్లా విభాగం అధ్యక్షుడు పిచ్చపాటి తిరపతిరెడ్డి, జెడ్పీటీసీ చెన్ను నళినీ పద్మ, మండల కన్వీనర్ నోటి వెంకటేశ్వరరెడ్డిలకు మట్టే వేణు కృతజ్ఞతలు తెలిపారు.

45 మందికి వైద్య పరీక్షలు



హాజీపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హనుమంతునిపాడు: మండల పరిధి హాజీపురంలో 104 వాహనం ద్వారా 45 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ దార్ల సందీప్‌కుమార్ తెలిపారు. రోగులను పరీక్షించి వారికి అవసరమైన మందులు అందజేశారు. వైద్య సిబ్బంది, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం , ఆశా వర్కర్లు ఉన్నారు.

నేడు మాలకొండలో వేలంపాట

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో దుకాణాల నిర్వహణకు శుక్రవారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాగర్‌బాబు తెలిపారు. వేలంపాటలకు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. పాట సొంతం చేసుకున్న హెచ్చుదారుడు నగదును సగం వేలంలోనే చెల్లించాలన్నారు.

దరఖాస్తుల స్వీకరణ గడువు పెంపు

వెలిగండ్ల(కనిగిరిరూరల్): బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు గడువును ఈ నెల 12వ తేదీ లోగా పొడిగించినట్లు ఎంపీడీఓ ఎస్‌కే మహబూబ్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 30వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని డీజీపేట గ్రామ సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిసర గ్రామ ప్రజలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు గురువారం తెలిపారు. ప్రస్తుతం మండల కేంద్రమైన సీఎస్‌పురం సచివాలయంలోనే ఆధార్ నమోదుకేంద్రం ఉందని, ప్రజా అవసరాల దృష్ట్యా రెండో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

భౌతికకాయానికి నివాళులర్పించిన జెడ్పీటీసీలు



గోవిందమ్మ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీలు

కనిగిరిరూరల్: మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఆరికట్ల బ్రహ్మరెడ్డి తల్లి ఏ గోవిందమ్మ(75) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. చాకిరాల పంచాయతీలోని భూతం వారిపల్లిలో ఆరికట్ల గోవిందమ్మ భౌతికకాయాన్ని జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఒంటిపెంట వెంకటరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గంగా వైన్స్‌లో చోరీ

ఒంగోలు టౌన్: నగరంలో ఒక వైన్స్ షాపులో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నగరంలోని మంగమ్మ కాలేజీ జంక్షన్లోని గంగా వైన్స్ షాపులో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షాపు పైన పెంకులు తీసేసి లోపలకు ప్రవేశించిన దొంగలు కౌంటర్లోని రూ.1.70 లక్షల నగదు, 7 మద్యం బాటిళ్లను దొంగిలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్లు డీలా...!

- పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలతో పడిపోయిన రిజిస్ట్రేషన్ల సంఖ్య
- నాడు రోజుకు 40-50 రిజిస్ట్రేషన్లు
- నేడు రోజుకు 15 నుంచి 20 మాత్రమే
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రియల్‌ఎస్టేట్ వ్యాపారులు



బోసిపోయిన కనిగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కనిగిరిరూరల్:

కూటమి ప్రభుత్వంలో ప్రతి రంగం తిరోగమనం లో పయనిస్తుంది. సంపద సృష్టి పేరుతో ఇష్టం వచ్చినట్లు ధరల పెంపుతో ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు, నిత్యావసరాల ధరల భారీగా పెరుగుదలతో ప్రజలు విలవిలలాడుతున్నారు. తాజాగా రిజిస్ట్రేషన్ల ఫీజు పెంచి కొత్త బాదుడుకు శ్రీకారం చుట్టారు. దీంతో భూముల అమ్మకాలు, కొనుగోళ్ల సంఖ్య తగ్గింది.. రీయల్ ఢీలా పడింది. రిజిస్ట్రేషన్ల ఫీజుల ఆదాయం భారీగా పడిపోయింది.

రిజిస్ట్రేషన్లపై తీవ్ర ప్రభావం..

రిజిస్ట్రేషన్ల ధరల పెంపుతో ప్రజల్లో నుంచి తీవ్ర వ్యతిరేకత, ఆవేదన వ్యక్తమవుతుంది. భూముల కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ భారీగా పడిపోయింది. కనిగిరి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని ఆరు మండలాల్లో గతంలో రోజుకు 40 నుంచి 50 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి.. దీనికి సంబంధించి చలనా, ఇతర రెండు రకాల ఫీజులు సుమారు రూ.35 నుంచి 40 లక్షల వరకు ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యేవి. కానీ గత నాలుగు రోజుల నుంచి పరిశీలిస్తే.. 15నుంచి 18 వరకు మాత్రమే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలిసింది.

రియల్ ఢీలా..

గత వారం వరకు అప్పాసోప్పా చేసి హడావుడిగా కొందరు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కానీ ఫీజుల పెరిగిన తరువాత ఒక్కసారిగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తగ్గిపోయింది. రోజుకు 50 రిజిస్ట్రేషన్ల నుంచి 20 లోపు రిజిస్ట్రేషన్లు మాత్రమే ప్రస్తుతం జరుగుతున్నాయి.

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు ఇలా..

కనిగిరి సబ్‌రిజిస్ట్రార్ పరిధిలోని కనిగిరి, పామూరు, పీసీపల్లి, సీఎస్‌పురం, వెలిగండ్ల, హనుమంతునిపాడు మండలాల్లోని 179 రెవెన్యూ గ్రామాలున్నాయి. కూటమి సర్కార్ ఈనెల 1నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచింది. గతంలో 2019 లో 162 గ్రామాల్లో రిజిస్ట్రేషన్ విలువలు పెంచని గ్రామాల్లో 15 నుంచి 20 శాతం పెంచింది. కనిగిరి మండలం శంఖవరం, హాజీస్ పురం, చల్లగిరిగిల్ల, చాకిరాల, చీర్లదిన్నె, గురువాజీపేట, పేరంగుడిపల్లి,చిన ఇర్లపాడు, కనిగిరి పట్టణం, పామూరు పట్టణం, పామూరు మండలంలోని వగ్గం పల్లి, దూబగుంట, మోపాడు, కంభాలదిన్నె, నుచ్చుపొద, బొట్లగూడూరు, దాదిరెడ్డిపల్లి తదితర 17 గ్రామాల్లో గతంలో రిజిస్ట్రేషన్ల విలువలు పెరిగినందున ప్రస్తుతం ఆయా ఏరియాల్లో 3.5 శాతం నుంచి 5 శాతం వరకు పెంచినట్లు అధికారులు వెల్లడించారు. పెంచిన ప్రభుత్వ బాదుడును బట్టి చూస్తే కనిగిరి సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని గ్రామాల్లో స్థలాల రిజిస్ట్రేషన్ విలువ భారీగా పెరిగాయి. గతంలో ఎకరా మార్కెట్ విలువ రూ 1.32 లక్షలు ఉండగా, సవరించిన విలువ ప్రకారం రూ 1.60లక్షలకు పెరిగిందని అధికారులు వెల్లడించారు. స్థలాలు చదరపు గజం రూ.380 నుంచి రూ.450 వరకు పెరిగింది. కనిగిరి పట్టణంలో భవనాలు చదరపు అడుగుల రూ.1400 నుంచి రూ.1490కి పెరిగింది.

కొత్త ధరలతో రిజిస్ట్రేన్లు చేస్తున్నాం:



ప్రభుత్వ ఆదేశాలతో ఈ నెల 1 నుంచి కొత్త రేట్లతో రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నాం. 2023లో పెరిగిన 17 గ్రామాల్లో 3.5 నుంచి 5 శాతం మాత్రమే పెరిగింది. పొలాలు, స్థలాలు, భవనాలు, అన్ని ఆస్తులకు వాటి మార్కెట్ విలువ ప్రకారం రుసుంలను చెల్లించాలి. పెరిగిన రిజిస్ట్రేషన్ ధరల వివరాలను కార్యాలయంలో అందుబాటులో ఉంచాం.

ఏ వాసుదేవ్‌రెడ్డి (సబ్‌రిజిస్ట్రార్, కనిగిరి)

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



అర్జీలు పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ



రీసర్వే భూములను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

కనిగిరిరూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నాల్గు మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వీఆర్వోలతో సమిక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సు అర్జీలన్నీ సాధ్యమైనంత పరిష్కరించి, అర్జీదారుని తగు న్యాయం చేయాలన్నారు. మండలాల వారిగా జేసీ లాగిన్‌లో వచ్చిన అర్జీల వివరాలను తెలుసుకుని వారి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

నాల్గు మండలాల అర్జీలు పరిశీలన

కనిగిరి, హెచ్‌ఎంపాడు, వెలిగండ్ల, మర్రిపుడి మండలాల్లో జేసీ లాగిన్‌లో వచ్చిన అర్జీల తక్షణ పరిష్కారానికి జేసీ చర్యలు తీసుకున్నారు. కనిగిరి మండలంలో 21 అర్జీలకు గాను తక్షణ పరిష్కారంగా 5 అర్జీలను పరిష్కరించారు. కార్యక్రమంలో డీఏఓ, నాల్గు మండలాల తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది, వీర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు. తొలుత రీసర్వే జరుగుతున్న పీపీ కంద్రిక భూముల ప్రాంతాలను జేసీ పరిశీలించారు. వీరి వెంకట ఏడీ గౌస్‌బాషా, తహసీల్దార్ రవిశర్మ, డీఏఓ బాలాజీ విశ్వనాద్, సర్వేయర్లు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూడాలి



క్యూరింగ్ జరిగిన పొగాకును పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూడాలని కొండపి వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ అన్నారు. బోర్డు పరిధిలోని వర్ధినేనివారిపాలెంలో గురువారం పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్‌లపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుట్కా, ఖైనీ, సిగరెట్లు, బీడీలు ఇతర వస్తువులు బేళ్లలో రాకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పొగమల్లె సమూలంగా నిర్మించేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పచ్చి ఆకు రవాణా చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రీజనల్ మేనేజర్ ఆఫీస్ ఏఎస్ తులసి, ఐటీసీ కంపెనీ మేనేజర్ వెంకటరావు, పోలిశెట్టి కంపెనీ మేనేజర్ రామాంజనేయులు, పీఎస్‌ఎస్ హెచ్ కంపెనీ వివేక్, ఎఫ్ఓ సాగర్ బాబు, మోతిలాల్, క్షేత్రస్థాయి సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ త్వరితగతిన పూర్తిచేయాలి



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

సీఎస్‌పురం(పామూరు): ఫ్రీ హోల్డ్ భూములను గుర్తించేందుకు నిర్వహిస్తున్న విచారణను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ పొన్నరుసు వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని వీఆర్‌ఓలు, సర్వేయర్లతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు రీసర్వే పూర్తిచేసిన గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై విచారణ చేపట్టి సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో మండల సర్వేయర్ బ్రహ్మానందరెడ్డి, వీఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించండి



పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్

పొన్నలూరు: గ్రామాల్లో నేరాల నియంత్రణపై దృష్టిపెట్టి శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా పనిచేయాలని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధతతో పనిచేసి ఫిర్యాదుదారులకు జవాబుదారీగా ఉండాలన్నారు. పేకాట, గంజాయి, అక్రమ మద్యం అమ్మకాలపై నిరంతరం నిఘా ఉంచి అసాంఘిక కార్యకలపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాత్రి సమయంలో దొంగతనాలు జరకుండా గ్రామాల్లో పోలీస్ పెట్రోలింగ్ చేపట్టాలన్నారు.

ఐదు పంటలను వాణిజ్య పంటలుగా గుర్తింపు



మాట్లాడుతున్న పరిశోధన సంస్థ డైరెక్టర్ శేషు మాధవ్

కందుకూరు రూరల్: వాణిజ్య పంటలుగా పొగాకుతోపాటు మిరప, పసుపు, అశ్వగంధ, ఆముదం పంటల పరిశోధనలను కూడా ప్రభుత్వం గుర్తించిందని రాజమండ్రి జాతీయ వాణిజ్య పంటల పరిశోధన సంస్థ డైరెక్టర్ ఎం.శేషు మాధవ్ అన్నారు. కందుకూరులోని కేవీకే, సీటీఆర్ఐలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) పేరును జాతీయ వాణిజ్య పంటల పరిశోధన సంస్థ (ఎన్ఐఆర్‌సీఏ)గా ఈ ఏడాది జనవరిలో చేసిందన్నారు. పొగాకుతోపాటు మిరప, పసుపు, ఆశ్వగంధ, ఆముదం పంటలను జోడించిందన్నారు. ఈ ఐదు పంటలు కోతల అనంతరం ప్రాసెసింగ్, విలువ జోడింపు, ఎగుమతులు, దిగుమతులుపై ప్రత్యామ్నాయాలను కనుగొనడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు తమ కార్యాచరణను రైతుల సమస్యలకు పరిష్కారాలను చూపేలా ఉండాలన్నారు. దిగుబడులు, నికర ఆదాయం పెంచేలా తయారు చేసుకోవాలన్నారు. ఎస్సీఎస్‌పీ పథకం కింద మహిళలకు కూరగాయల విత్తనాలు, గొర్రెల రైతులకు క్రీపు దాణాను ఇచ్చి వాటిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. వాణిజ్య సరళిలో గొర్రె పిల్లలను, పొట్టేళ్ల పెంపకాన్ని, పాడిని చేపట్టి ఉపాధి పొందాలని సూచించారు. రైతులు, రైతు మహిళలు తరచూ కేవీకేతో అనుసంధానంలో ఉంటూ పరిశోధన, విస్తరణ అంతరాలను తెలిపితే తదనుగుణంగా పరిశోధనలు చేసి పరిష్కారాలను అందిస్తామన్నారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్ బాబు కేవీకే కార్యక్రమాలను డైరెక్టర్‌కు వివరించారు. సీటీఆర్ఐ హెడ్ ఎం.అనూరాధ పరిశోధనా కేంద్రంలో పరిశోధనల పురోగతిని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు గంగాధర్, జ్యోతి, వెంకటేష్, వివేక్, శ్రీరంగ, మయాంక్, నీహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్‌యాదవ్

సింగరాయకొండ: తుఫాన్లు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఎలా ఎదుర్కోవాలో, ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో అధికారులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ టి.రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలస్థాయి అధికారులతో విపత్తు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ అధికారి వీవీ ఎన్ ప్రసన్నకుమార్ ప్రకృతి వైపరీత్యాలను ఏవిధంగా ఎదుర్కోవాలో వివరించారు. తరువాత జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎన్డీఆర్ఎఫ్ విజయవాడ 10వ బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్‌యాదవ్ ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ఏవిధంగా రక్షించుకోవాలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. తుఫానులలో చిక్కుకున్న వారిని రక్షించినప్పుడు వారికి ఏవిధంగా సీపీఆర్ చేయాలో కృత్రిమ బొమ్మల ద్వారా అర్థమయ్యే రీతిలో వివరించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్, డిప్యూటీ కలెక్టర్ కె.మాధురి, ఎంపీడీఓ డి.జయమణి, ఏఎస్ఓ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి చేస్తాం

టంగుటూరు: వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేస్తామని పార్టీ చేనేత విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బుర్రా అంకరాజు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కొమ్ము ప్రభుదాసు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఈ అవకాశం కల్పించిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మర్రిపూడి: వైఎస్సార్ సీపీ రైతు విభాగం, ఆర్టీఐ విభాగం అధ్యక్షులుగా రావెళ్లవారిపాలెం గ్రామానికి చెందిన బొల్లినేని నాగేశ్వరరావు, గార్లపేట గ్రామానికి చెందిన దిండు నరసింహారావులు నియమితులయ్యారు. అలాగే వైఎస్సార్ టీయూసీ అధ్యక్షునిగా మండలంలోని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన ఇనుకొల్లు సుబ్బారెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను నియమించినందుకు మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

టీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్

కందుకూరు రూరల్: కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ కళాశాలల సిబ్బందికి, విద్యార్థులకు ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో అత్యున్నత విద్యార్హతలు కలిగిన అధ్యాపకుల, మెరుగైన సౌకర్యాలు, లేబొరేటరీ సౌకర్యాలు, విశాలమైన క్రీడాస్థలం ఉన్నాయన్నారు. విద్యార్థులను ఉద్యోగాలకి సిద్ధం చేసి తమ కళాశాల నుంచి పంపించడం లక్ష్యమంగా అధ్యాపకులు పని చేస్తున్నట్లు తెలిపారు. చుట్టుపక్కల జూనియర్ కళాశాల విద్యార్థులను కళాశాలలో చేరే విధంగా సహకరించాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రజెంటేషన్ తర్వాత జూనియర్ కళాశాల సిబ్బంది, డిగ్రీ కళాశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. కందుకూరు, పొన్నలూరు, సింగరాయకొండ, టంగుటూరు, చుండి, వలేటివారిపాలెం జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, టీఆర్ఆర్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండల నరేంద్ర, అధ్యాపకులు కె.సుజాత, కేవీ.పద్మావతి, పి.రాజగోపాల్, ఎన్వీ.శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో ఎరువుల వేలం



వేలం నిర్వహిస్తున్న ఏడీఏ అనసూయ

కందుకూరు: కందుకూరులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలోని ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో ఎరువుల వేలం కార్యక్రమం గురువారం వ్యవసాయ సహాయ సంచాకురాలు పి.అనసూయ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏప్రిల్ 2021 నుంచి మార్చి 2024 వరకు పరీక్ష చేసి నాణ్యమైనవిగా నిర్ధారించిన ఎరువులను వేలం వేస్తున్నామన్నారు. ఈ వేలంలో పాల్గొన్న రైతులు పాట పాడుకున్నారు. సీహెచ్.ప్రభాకర్ అనే రైతు గరిష్ఠంగా 850లకు హెచ్చుపాట పాడి దక్కించుకున్నాడు. 93.7 కేజీల ఎరువులను అప్పగించినట్లు ఏడీఏ తెలిపారు. యూరియా 31కేజీలు, డీఏపీ 6.4 కేజీలు, పొటాష్ 2.5 కేజీలు, ఎంపీ కాంప్లెక్స్ 20.12కేజీలు, ఎన్‌పీకే కాంప్లెక్స్ 8.6 కేజీలు, ఎస్ఎస్‌పీ 25.56కేజీలు, మొత్తం 93.7కేజీలు వేలం పాట ద్వారా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు టెక్నికల్ ఏఓ సీహెచ్‌వీఎల్.దుర్గ, ల్యాబ్ ఏఓ వి.గీతాప్రకాష్, ఏఈఓలు కె.హర్షవర్ధన్, ఎం.హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయాలు



కొండలరావును పరామర్శిస్తున్న ఏఓ విజయ్‌కుమార్

కొండపి: మండలంలో వెన్నూరు గ్రామ వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తున్న జె .కొండలరావుకు కుక్కల దాడిలో గాయపడ్డాడు. గురువారం ఉదయం విధులు నిమిత్తం ద్విచక్రవాహనంపై వెన్నూరు బయలుదేరగా మార్గమధ్యంలో కుక్కలు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనాన్ని పక్కన ఆపాడు. కుక్కలు వెంటనే అతని మీద దాడి చేయడంతో గాయాలు పాలయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానిక హెల్త్ కమ్యూనిటీ సెంటర్లో చేరాడు. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ చికిత్స పొందుతున్న కొండలరావును పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

నేడు టాలెంట్ టెస్ట్

పీసీపల్లి: మండలంలోని నేరేడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు టి.అంజనీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. త్యాగంరెడ్డి కొండారెడ్డి సహకారంతో విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నామన్నారు.